క్లుప్తంగా

వైభవంగా ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణులు

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో ఉన్న శ్రీసమర్థనారాయణ ఆశ్రమంలో గురువారం శ్రీసద్గురు సమర్థ రామదాసు స్వామి ఆరాధన ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా సీతారామలక్ష్మణులకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. కలశస్థాపన, సంప్రదాయ భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీసమర్థ రామదాసు విగ్రహానికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆశ్రమ పీఠాధిపతి గోపాల స్వామి భక్తులను ఆశీర్వదించారు. ఈ నెల 22వ తేదీ వరకు ఆరాధనోత్సవాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

అబార్షన్‌లపై విచారణ



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ, అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : జమ్మలమడుగు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన అబార్షన్‌లపై వైద్యాధికారులు విచారణ నిర్వహించారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలోని పీపీయూనిట్‌లో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, గైనకాలజిస్టు డాక్టర్ కావ్య గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవసరం లేకున్నా అబార్షన్‌లు చేయించుకుంటున్నారని తెలిపారు. మొదటి, రెండవ కాన్పులో ఆడపిల్లలు పుట్టిన వారు లేదా మొదటి కాన్పులోనే ఆడపిల్ల పుడుతుందనే కారణాలతో అబార్షన్‌లు చేయించుకుంటున్నట్లు చెప్పారు. ఎక్కడ అబార్షన్‌లు చేయించుకుంటున్నారో విచారించి సంబంధించిన ప్రైవేట్ ఆస్పత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రజలు ప్రశాంతంగా జీవించాలి



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎస్ఐ చిన్న పెద్దయ్య

చాపాడు : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు గొడవలు, కక్షలకు పాల్పడకుండా ప్రశాంత జీవితాన్ని గడపాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని చిన్నవరదాయపల్లె గ్రామంలో గురువారం జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామంలోని ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న చిన్న సమస్యలకు ఆధిపత్యం కోసం గొడవలకు పాల్పడకుండా ప్రశాంత జీవితం గడపాలన్నారు. పిల్లలను కష్టపడి చదివించుకోవాలని సూచించారు. క్షణికావేశంలో బంధువులతో పాటు ఇతరులతో కూడా ఘర్షణకు దిగడం వలన కుటుంబాలు, పిల్లలు ఇబ్బందులకు గురవుతారన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ పరిశీలన



చెత్త సేకరణను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : స్థానిక వరలక్ష్మి అపార్ట్‌మెంట్, నాగేంద్రనగర్, మిట్టమడి మెయిన్ రోడ్డు, రామేశ్వరం మోరీలు ప్రాంతాల్లో గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పర్యటించి ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ వసూలు చేయాలని, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా హోం కంపోస్టింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.గోవిందరెడ్డి, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

కాశినాయన : మండల సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన ఎంపీపీ నల్లేరుపోలమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మైథిలి తెలిపారు. మండలస్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలన్నారు. అలాగే ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

నేలబారు చదువులు



బెంచీలు లేక నేలపైనే కూర్చున్న విద్యార్థులు

- అమృతానగర్ జెడ్పీ హైస్కూల్‌కు సొంత భవనం కరవు
- తాగునీటికి విద్యార్థుల అవస్థలు
- అసౌకర్యాల నడుమ భావిపౌరులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ప్రొద్దుటూరు రూరల్ : విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని అమృతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలు తాండవిస్తున్నాయి. తరగతి గదులు కొరత.. వసతులలేమితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, మండల పరిధిలో నిరుపేదలకు అమృతానగర్‌లో ఇళ్లు నిర్మించారు. ఇక్కడ సుమారుగా 8 వేల కుటుంబాలకుపైగా నివసిస్తున్నారు. ప్రొద్దుటూరు పట్టణానికి కొంత దూరంగా ఉండటంతో ఈ కాలనీలో అప్పట్లోనే ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యాశాఖాధికారులు హైస్కూల్ అవసరమని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ 2023లో ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి నుంచి ఆ పాఠశాలలో ఒకటి రెండు తరగతులు నిర్వహిస్తూ అమృతానగర్‌లోని మడూరు రోడ్డులోని మైనారిటీ బాలికల వసతి గృహం ఖాళీగా ఉండటంతో హైస్కూల్ నిర్వహణకు విద్యాశాఖాధికారులు తాత్కాలిక అనుమతులు జారీ చేశారు. అక్కడే మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. 8 మంది ఉపాధ్యాయులు ఉండగా, 255 మంది విద్యార్థులు హైస్కూల్‌లో చదువుకుంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు

పాఠశాల ఆవరణం పందులకు, తాగుబోతులకు ఆవాసంగా మారింది. పాఠశాల ముగియగానే ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండేవి. ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఆకతాయిలను కట్టడి చేయలేకపోయారు. పాఠశాలలో ఫ్యాన్లు, తలుపులు, మురుగుదొడ్ల పైపులను దుండగులు పగులకొట్టారు. దీంతో మురుగునీరు ఎక్కడిక్కడ నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. వసతులు కల్పించాలని అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం శూన్యం. విద్యార్థుల అవస్థలు చూసి చలించిపోయిన ఉపాధ్యాయులు సొంత నిధులతో పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు. ప్రతి తరగతి గదికి ఒక బల్బు, ఒక ఫ్యాన్, పాఠశాల ఆవరణం లోకి ఎవరూ రాకుండా ఇనుప కడ్డీలతో రక్షణ వలయం, విద్యార్థులకు తాగునీటిని ఉపాధ్యాయులే ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి తరగతి గదిలో ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో ఇరుకుగా కూర్చొని చదువుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం హైస్కూల్ భవనం నిర్మించి పిల్లల చదువులకు అన్ని రకాల మౌలిక వసతులు, ఉపాధ్యాయులను సమకూర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయంపై పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్నను సాక్షి వివరణ కోరగా పాఠశాల సమస్యలపై విద్యాశాఖాధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేశామన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉండటం వల్ల ఈ హాస్టల్ భవనం ఇరుకుగా ఉందని, ఎటువంటి మౌలిక సదుపాయాలు లేవని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కూడా ఉందని తెలిపారు.



ఉపాధ్యాయులు కొనుగోలు చేసి తెప్పించిన మినరల్ వాటర్ క్యాన్లు

జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో సత్తా

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక క్యూబా మసీదు వీధిలోని కె.రహిముద్దీన్, షబ్నంల కుమారుడు కె.అబ్దుల్లా జాతీయ స్థాయి అండర్-17 క్రికెట్ పోటీల్లో సత్తా చాటాడు. ఇటీవల ఆగ్రాలో మినిస్ట్రీస్ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఆల్ ఇండియా నేషనల్ టీ 20 క్రికెట్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొన్నాడు. ఈ పోటీల్లో 89 పరుగులు చేసి బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డుతోపాటు మెడల్, సర్టిఫికెట్‌ను అబ్దుల్లా అందుకున్నారు. స్థానిక ఎల్ఐసీ ఆఫీసు సమీపంలో పీస్ హైస్కూల్‌లో విద్యార్థి అబ్దుల్లా 9వ తరగతి చదువుతున్నాడు. జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చూపిన ఈ విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ అశ్వక్, ప్రిన్సిపాల్ లాలుఖాన్, హెడ్మాస్టర్ రూహుల్లాహ్, ఏఓ మహబూబ్ బాషా, పీఈటీ భాస్కర్ అభినందించారు.



అవార్డు, బహుమతులతో అబ్దుల్లా

పశువైద్య విద్యార్థుల నిరసన

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో విద్యార్థులు గురువారం ఓపీ సేవలను నిలిపి వేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు సమానంగా తమ స్టైఫండ్‌ను పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉదయం 10 గంటల నుంచి 11.20 గంటల వరకు పశువైద్యశాలకు తాళాలు వేసి సేవలు నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ఫోరం ఆఫ్ రిజిస్టార్డ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఓఆర్టీఓ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులు రెడ్డి అక్కడికి చేరుకుని మూగ జీవాలకు వైద్య సేవలు నిలిపివేయడం సరైన పద్ధతి కాదన్నారు. వీసీసీటీ రాష్ట్ర చైర్మన్ లక్ష్మయ్యతో ఆయన ఫోన్‌లో మాట్లాడి పశువైద్య విద్యార్థుల డిమాండ్లను, సమస్యలను వివరించారు. త్వరలోనే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని వీసీసీటీ రాష్ట్ర చైర్మన్ హామీ ఇవ్వడంతో పశువైద్యశాలను తలుపులను విద్యార్థులు తెరిపించారు. అనంతరం కళాశాల ఆవరణలోనే విద్యార్థులు కూర్చొని నిరసన తెలిపారు. తమకు స్పష్టమైన హామీ వచ్చే వరకు నిరసన కొనసాగిస్తామని వారు చెప్పారు.



పశువైద్యశాలకు తాళం వేసి నిరసన తెలుపుతున్న విద్యార్థులు

నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ప్రొద్దుటూరు రూరల్ : సినిమా థియేటర్ల యజమానులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ గంగయ్య తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ప్రొద్దుటూరు సినిమా థియేటర్ల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కొత్త సినిమాలు విడుదలైనప్పుడు అధిక ధరలకు టికెట్లు విక్రయించవద్దని సూచించారు. బెన్‌ఫిట్ షోలు వేయరాదని సూచించారు. సినిమా థియేటర్లలో నడిపే క్యాంటిన్లలో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే తినుబండారాలను విక్రయించాలన్నారు. ప్రజల వద్ద నుండిచి ఫిర్యాదులు రాకుండా నడుచుకోవాలని తెలిపారు.



సినిమా థియేటర్ల యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గంగయ్య

భావితరాలకు ఆదర్శంగా ఉండాలి

పోరుమామిళ్ల : పుల్లివీడు ప్రజలు నీతి నిజాయితీతో ఉంటూ భావితరాలకు ఆదర్శంగా ఉండాలని బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి పద్మశ్రీ తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు పుల్లివీడు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా నిర్ణయించిన సందర్భంగా మంగళవారం పుల్లివీడులో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు, కోర్టుకు తిరగకుండా చిన్న చిన్న సమస్యలు తలెత్తితే ప్రీ లిటిగేషన్ కేసు ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. చట్టం, న్యాయం గురించి వివరిస్తూ ఎస్ఐ కొండారెడ్డి ప్రజలు జాగ్రత్తగా మెలగాలన్నారు. సదస్సులో సర్పంచ్ రఘునాథరెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి పద్మశ్రీ

ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరం

చాపాడు : వాహనాలు నడిపే క్రమంలో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని ప్రొద్దుటూరు రోడ్డు ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్(ఆర్టీఓ) మురళీధర్ పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో గురువారం 36వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్టీఓ మాట్లాడుతూ.. మోటార్ బైక్ నుంచి కార్లు, బస్సులు, లారీలు ఇతర వాహనాలు నడిపే క్రమంలో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమ నిబంధనల గురించి తెలుసుకోవాలన్నారు. డ్రైవింగ్ నేర్చుకుని నిబంధనల మేరకు లైసెన్స్ పొందాలని, అనంతరం వాహనాలను రోడ్డుపై నడపాలన్నారు. అనంతరం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు హేమకుమార్, రవీంద్రనాయక్‌లు విద్యార్థులకు రోడ్డు భద్రత, వాహనాల డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ ప్రిన్సిపాల్ డా.శృతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఓ మురళీధర్

నర్సులకు పదోన్నతి

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారి మఠం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు వీరజోత్స్న, విజయలక్ష్మిలకు ప్రమోషన్లు వచ్చాయని డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ మల్లేష్ తెలిపారు. గురువారం స్థానిక బి.మఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆ ఇద్దరు ఏఎన్ఎంలలో ఒకరిని బి.మఠం మండలం మల్లేపల్లె, డి నేలటూరు సబ్‌సెంటర్లకు బదిలీ చేశారు.

డీలర్‌పై కేసు నమోదు



మిద్దెల రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కాశినాయన : మండలంలోని మిద్దెల రేషన్ షాపు డీలర్‌పై 6(ఎ) కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని నరసాపురం, మిద్దెల రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నరసాపురం రేషన్ దుకాణానికి తాళం వేశారని తెలిపారు. మిద్దెల రేషన్ షాపులో స్టాకు రిజిస్టర్‌కు, ఉన్న స్టాకుకు తేడా రావడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్థానిక డీలర్ అందుబాటులో లేడు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గీతాప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ముంతాజ్ హోటల్ అనుమతులు రద్దు చేయాలి

ప్రొద్దుటూరు : తిరుపతి అలిపిరి సమీపంలో టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ముంతాజ్ హోటల్ అనుమతులను రద్దు చేయాలని విశ్వహిందూ పరిషత్, బీజేపీ, శివశక్తి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక శివాలయం సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుమల సమీపంలో ముంతాజ్ హోటల్‌కు అనుమతులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. పలు మార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం ఏమి తెలియనట్లు వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ముంతాజ్ హోటల్‌కు అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చెన్నకేశవస్వామి సన్నిధిలో ఎమ్మెల్సీ

బి.కోడూరు : మండలంలోని రాజుపాలెం గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి వారిని గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం రాజుపాలెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరామిరెడ్డి వారి వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ మునిరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయి నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాల సింహగర్జన విజయవంతం చేయాలి

గోపవరం : ఈనెల 16వ తేదీన ఎమ్మిగనూరులో నిర్వహించనున్న మాల సింహగర్జను విజయవంతం చేయాలని మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే ఈ సభను జయప్రదం చేయాలన్నారు. నియోజకవర్గంలోని మాలలందరూ సభకు హాజరు కావాలని కోరారు.

బ్రహ్మోత్సవ వైభవం

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడవరోజు గురువారం స్వామికి చండీహోమం, శ్రీ చక్రార్చన, ఇతర పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ యాగ శాలలో చండీహోమం, శ్రీచక్ర మండపంలో నవావరణ శ్రీచక్రార్చనలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శ్రీ విజయ దుర్గా మల్లికార్జునులకు ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం బ్రహ్మోత్సవాల ప్రత్యేక దర్శనాల కోసం విచ్చేసిన భక్తులతో ఉదయం నుంచి సందడిగా మారింది. స్థానిక బృందాలతోపాటు సమీప గ్రామాల నుంచి విచ్చేసిన కోలాటం బృందాలు అమ్మవారి సన్నిధిలో నృత్యాలు చేసి భక్తులను అలరించి తమ భక్తిని చాటుకున్నారు.

వ్యాధి నిర్ధారణ కోసం స్కానింగ్‌లు చేయాల్సిందే

- ఎంబీబీఎస్ డాక్టర్లు కూడా ఎమ్మారై, సీటీ స్కాన్ రాయొచ్చు
- డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి



ఎమ్మారై తీయించుకోవడానికి వచ్చిన వ్యక్తితో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి

ప్రొద్దుటూరు క్రైం : వ్యాధి నిర్ధారణ జరగాలంటే ఖచ్చితంగా సీటీ, ఎమ్మారై స్కాన్లు చేయాల్సిందేనని డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి తెలిపారు. సర్జన్‌లు మాత్రమే స్కానింగ్‌ను రాయాలనే నిబంధన లేదని డ్యూటీలో ఉన్న ఎంబీబీఎస్, అసిస్టెంట్ సివిల్ సర్జన్లు కూడా స్కానింగ్ సూచించవచ్చని పేర్కొన్నారు. అయితే స్పెషలిస్టుల సలహా తీసుకోవాలని చెప్పారు. డీసీహెచ్ఎస్ గురువారం జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలోని అత్యవసర విభాగం, లేబర్ వార్డులను పరిశీలించారు. అలాగే సీటీ, ఎమ్మారై విభాగాలను సందర్శించి అక్కడి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం మెడికల్ సూపరింటెండెంట్ చాంబర్‌లో డీసీహెచ్ఎస్ మీడియాతో మాట్లాడారు. ఇటీవల ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ జిల్లా ఆస్పత్రికి వచ్చారన్నారు. ఎంబీబీఎస్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు స్కానింగ్‌లు సూచించవద్దని, స్పెషలిస్టు సివిల్ సర్జన్లు మాత్రమే రాయాలని చెప్పారన్నారు. దీనిపై ఇక్కడి వైద్యులతో మాట్లాడి కొన్ని సూచనలు చేయడానికి వచ్చినట్లు డీసీహెచ్ఎస్ తెలిపారు. మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు నేతృత్వంలో ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఓపీలో ఉన్న ఎంబీబీఎస్, సీఏఎస్‌లు ఎమ్మారై, సీటీ స్కాన్‌లు రాసినా అందుబాటులో ఉండే సర్జన్‌ల సూచనలు తీసుకోవాలని సూచించారు.

మహాసభలను జయప్రదం చేయండి



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : కడపలో ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రాంతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య కోరారు. గురువారం మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాసభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, ఏపీ రైతు సంఘం నాయకులు రావుల వెంకటయ్య, జి.ఈశ్వరయ్య, నీటి పారుదల రంగ నిపుణులు టి.లక్ష్మీనారాయణ, బొజ్జా దశరథరామిరెడ్డి పాల్గొంటారన్నారు. రాయలసీమలోని హంద్రీ-నీవా, తెలుగుగంగ, గాలేరు-నగరి, ఎస్‌బీసీ ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాల్సిన ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. కరువు సీమ రాయలసీమకు కృష్ణా జలాలు మళ్లింపే ఏకైక శరణ్యమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి గ్రామానికి సాగు, తాగునీరు సాధన కోసం భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ ప్రకటించేందుకు ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, జిల్లా సమితి సభ్యులు రామకృష్ణ, శివారెడ్డి, హరి, మద్దిలేటి, మచ్చా శ్రీనివాసులు, సుబ్బమ్మ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలనే డిమాండ్‌తో ఈనెల 22 నుండి 24 వరకు కడపలో నిర్వహించనున్న ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ, రైతు సంఘం నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అసంపూర్తి ప్రాజెక్టులకు ఒక్క రూపాయ కూడా కేటాయించలేదన్నారు. కృష్ణ, తుంగభద్ర, గోదావరి, పెన్నా నదుల అనుసంధానం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలు విడుదల చేస్తున్నారు కానీ రాష్ట్రంలో కరువు నివారణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. బ్రహ్మంసాగర్ కింద పంటకాలువలు పూర్తి చేయాలన్నారు. గాలేరు-నగిరి, గండికోట, వెలుగోడు, హంద్రీ-నీవా ప్రాజెక్టులకు నీరు ఇవ్వాలన్నారు. దిగువ సగిలేరు ప్రాజెక్టుకు షట్టర్లు కొత్తవి అమర్చాలని, లీకేజీలను అరికట్టాలన్నారు. పోలవరం సామర్థ్యం పెంచాలన్నారు. కడపలో జరిగే మహాసభలో భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయం ఉంటుందని, సభలో రైతులు, ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

మూడో రోజు మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ పట్టణ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మూడో రోజు కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారి వేతనాలను పెంచాలని యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, పట్టణ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షుడు చంటి, రాఘవేంద్ర, శివ, పద్మ, వెంకటేశులు, గుర్రప్ప, గంగాధర్‌రెడ్డి, గౌస్, మహ్మద్ పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

రాచమల్లు మునిరత్నమ్మకు నివాళి

ప్రొద్దుటూరు : మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తల్లి రాచమల్లు మునిరత్నమ్మకు గురువారం పెద్ద కర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పోరెడ్డి నరసింహారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, చేనేత విభాగం నియోకవర్గ అధ్యక్షుడు చౌడం రవితోపాటు పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నేతలు మునిత్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



రాచమల్లు మునిరత్నమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

కొలతల ప్రకారం పనులు చేయాలి

అట్లూరు : ఉపాధి కూలీలు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే నిర్ణయించిన కూలీ వేతనం అందుతుందని మండల అభివృద్ధి అధికారి యు.భాస్కర్‌బాబు తెలిపారు. మండలంలోని కుంబగిరి పంచాయతీ పరిధిలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలతో చేపట్టిన చిన్న నీటి కుంట పనులను ఆయన తనిఖీ చేసి మస్టర్‌రోల్‌ను పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడుతూ మీకు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసుకుంటే నిర్ణయించిన కూలీ వేతనం అందుతుందన్నారు. అలాగే ఉదయాన్నే పనులు చేపట్టి ఎండ తీవ్రతకు ముందుగానే పనులు ముగించు కోవాలని తెలిపారు. ఆయన వెంట ఏపీఓ జయచంద్రబాబు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ భాస్కర్‌బాబు

